



సరుబుజ్జిలి కళాశాలలో నిర్మాణం పూర్తయినా ప్రారంభంకాని మరుగుదొడ్లు

ఇంటర్ విద్యార్థులకు పరీక్షే!

- నేటి నుంచి పరీక్షలు
- సమస్యల నడుమ కేంద్రాలు
- కొన్నిచోట్ల దూరంగా కేటాయించడంతో ఇబ్బందులు

(సరుబుజ్జిలి/మెళియాపుట్టి)

జిల్లాలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా 83 కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం 19,937మంది, ద్వితీయ సంవత్సరం 25,765 మంది మొత్తం 45,702 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. 83మంది చొప్పున చీఫ్‌సూపరింటెండెంట్లు, డెవలప్‌మెంట్ అధికారులతోపాటు 1600మంది ఇన్విజిలేటర్లను నియమించామని అధికారులు తెలిపారు. మొత్తం 1,480 సీసీ కెమెరాల పర్యవేక్షణ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలుగకుండా, పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఆటువంటి పరిస్థితులు లేవు. చాలా కేంద్రాల్లో సమస్యలు నెలకొన్నాయి.

'నాడు-నేడు' పథకం పేరుతో సకాలంలో నిధులు మంజూరు కాక పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో పరీక్షా కేంద్రాల్లో అరకొర సౌకర్యాలే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు సరుబుజ్జిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో మరుగుదొడ్లతోపాటు రన్నింగ్ వాటర్ ఇంకా అందుబాటులోకి రాలేదు. ఆదరాబాదరాగా పనులు చేపట్టినా ఒకేషనల్ బ్లాక్‌నుంచి ప్రిన్సిపాల్ బ్లాక్‌కు తాగునీటి సదుపాయం కల్పించలేదు. అలాగే నూతనంగా ఒక్క బెంచీ కూడా లేదు. పాతవి, విరిగిపోయిన వాటికి ముస్తాబు చేయించారు. అప్పటికీ బెంచీలు చాలకపోతే పక్కనున్న ప్రైవేటు కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బెంచీలు తెప్పించి సర్దుబాటు చేశారు. మరోవైపు కళాశాలలో పరీక్షలు నిర్వహించేందుకు తరగతి గదులు చాలడం లేదు. బోటనీ, జువాలజీ, ల్యాబ్‌లోనే పరీక్ష గదిని కేటాయించారు. ఏ చిన్న తేడా వచ్చినా రసాయనాలు, ల్యాబ్ ఎక్విప్‌మెంట్‌తో విద్యార్థులు అవస్థలు పడాల్సిందే. మరోవైపు రేకుల షెడ్‌లో తాత్కాలికంగా నిర్వహిస్తున్న గ్రంథాలయంలోనూ కొన్ని రోజులు పరీక్షలు జరపనున్నారు. కళాశాల సిబ్బంది కోసం ప్రత్యేక గది లేకపోవడం, పరీక్షల సిబ్బంది, తనిఖీల బృందం ఎవరు వచ్చినా కూర్చోవడానికి ఆరుబయట సిమెంట్ బెంచీలు తప్ప ఎలాంటి సౌకర్యాలు లేవు.

- కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిందే. ఆపసోపాలు పడుతూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సిందే. ఈ క్రమంలో కొంతమంది విద్యార్థులు ఒత్తిడికి గురై.. ప్రమాదాల బారిన పడిన సంఘటనలు గతంలో అనేకం ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. చదువుతున్న కళాశాలలకు సమీపంలో కేంద్రాలు కేటాయిస్తే మేలని అభిప్రాయపడుతున్నారు.



బి.గణపతి



బి.భరత్‌కుమార్

- మెళియాపుట్టి మండలం పెద్దమడి గురుకుల కళాశాలలో సుమారు 176 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. వీరంతా చాపర, మెళియాపుట్టి కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. రోజూ 15 నుంచి 20 కిలోమీటర్లు ప్రయాణించి పరీక్ష రాయాలంటే ఇబ్బందేనని బి.గణపతి, బి.భరత్‌కుమార్ తదితర విద్యార్థులు వాపోతున్నారు. పరీక్ష కేంద్రం దూరంగా కేటాయించడంతో ఉదయం 6.30 గంటలకే ఇంటి నుంచి బయలుదేరాలని, ఈ క్రమంలో మరింత ఒత్తిడికి గురవుతున్నామని పేర్కొంటున్నారు. పెద్దమడిలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేస్తే మంచిదని అభిప్రాయపడుతున్నారు.

- మెళియాపుట్టి జూనియర్ కళాశాల కేంద్రంలో సుమారు 286 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఈ కేంద్రంలో ప్రహరీ లేకపోవడంతో బయట నుంచి వ్యక్తులు సులువుగా లోపలికి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఈ విషయమై ప్రిన్సిపాల్ వైకుంఠరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.



- సరుబుజ్జిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకుతోంది. నిర్మించినా ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు, చాలీచాలని తరగతి గదులు, విరిగిన పాత బెంచీలు, కానరాని తాగునీటి సదుపాయంతో విద్యార్థుల సహనానికే పరీక్షగా మారుతోంది. ఈ కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 200 మంది, ద్వితీయ సంవత్సరం 250 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రిన్సిపాల్ భూషణరావు సుమారు రూ.36లక్షలతో జీజే కళాశాల మరమ్మతులు చేయించారు. నిధుల విడుదలలో జాప్యం, స్థానిక నేతలను విస్మరించడం, రెగ్యులర్ సిబ్బందిని కాదని ఎంటీఎస్ లెక్కల మాస్టర్‌పై ఆధారపడడం, ప్రిన్సిపాల్ ఒంటెద్దు పోకడల నిర్ణయాలు.. తదితర కారణాలతో మరుగుదొడ్ల నిర్మాణాలు నత్తనడకన సాగాయి. పరీక్షల సమయానికి పనులు పూర్తయినా.. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ తమ్మినేని సీతారాం వాటిని ప్రారంభించలేదు. దీంతో వాటిని వినియోగంలోనికి తేవాలా? వద్దా? అనే సందిగ్ధంలో సిబ్బంది ఉన్నట్టు తెలుస్తోంది.



ల్యాబ్ గదులను వినియోగిస్తాం..



సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు గదుల సమస్య వాస్తవమే. ల్యాబ్ గదులను ఉపయోగించడానికి ప్రిన్సిపాల్ అనుమతిచ్చారు. పరీక్షలు రాసే విద్యార్థుల కోసం శుద్ధజలాన్ని తెప్పిస్తాం. నాడు-నేడులో ఫర్నీచర్ మంజూరు కాకపోవడంతో పాత బెంచీలను వినియోగిస్తున్నాం.

-ఆకెళ్ల రామారావు, చీఫ్ సూపరింటెండెంట్, సరుబుజ్జిలి

అప్పులుచేసి బటన్‌నొక్కుడు పాలన

- ముఖ్యమంత్రి జగన్ అబద్ధాలకోరు: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

నందిగాం, ఫిబ్రవరి 29: రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి.. సంక్షేమ పథకాలకు బటన్ నొక్కుతున్నామని చెప్పుకోవడానికే సీఎం జగన్ పాలన సాగిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. జగన్ అబద్ధాలకోరు అని ఆరోపించారు. గురువారం నందిగాం మండలం పెద్దబాణాపురంలో సర్పంచ్ పైల ఇందిరమ్మ, ఆమె భర్త రమేష్‌నాయుడుతో పాటు అనుచరులు అచ్చెన్న, ఎంపీ రామ్మోహన్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే ఆనందపురం పంచాయతీ వార్డు సభ్యురాలు రోణంకి రూపావతి, కెల్లి నవీన్, ఆర్.నారాయణరావు తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడుతూ.. 'సంపద సృష్టించి ప్రజలకు పంచినప్పుడే నిజమైన నాయకుడు అవుతారు. వైసీపీ పాలనంతా అప్పులమయం. ఉద్యోగాలు లేవు, పరిశ్రమలు లేవు, స్వయం ఉపాధి అవకాశాలు కూడా లేవు. జగన్ పాలనపై అన్నివర్గాల ప్రజలు విసిగిపోయారు. చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలో జగన్ పర్యటించి హంద్రీ నీవా ప్రాజెక్టుకు బటన్ నొక్కి 24 గంటలు కాకముందే అక్కడ కాలువలో ఆటలు ఆడుకున్నారు. ఇదీ ఆయన పనితనానికి నిదర్శనం. సొంత చెల్లినే పట్టించుకోని జగన్.. ప్రజలకు ఏమి మేలు చేస్తారు?. ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి.. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని సాగనంపాలి' అని పిలుపునిచ్చారు. టీడీపీ-జనసేన కూటమిని గెలిపిస్తే.. మేలైన పాలన అందిస్తామని తెలిపారు. ● ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రైతులకు అండగా ఉన్న టీడీపీకి పట్టం కట్టాలని కోరారు. అచ్చెన్నను తిట్టినందుకు దువ్వాడకు టెక్కలి టిక్కెట్ ఇచ్చారని, ఇటువంటి వ్యక్తులు ప్రజల మేలు కోరేవారు కారన్నారు. మంత్రి తప్పుల రాజు, ఆ పార్టీ నాయకులు శివారుప్రాంతానికి సాగునీరు అందించలేక ప్రతిపక్షంపై తప్పులు నెట్టారని, ఇటువంటి వారికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో టెక్కలి, కోటబొమ్మాళి పార్టీ అధ్యక్షులు బగాది శేషు, బోయిన రమేష్‌లు, టెక్కలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, కె.హరివరప్రసాద్, టి.మహేష్, మదన్‌గౌడ్, కె.ప్రసాదరావు, హరిబాబు, ఎం.సింహాచలం, పి.జోగారావు, ఎస్.జానకిరాం, డి.సన్యాసిరావు, మోహనరావు, జె.మోహనరావు, వి.విజయలక్ష్మి, రామకృష్ణ, గోవిందరాజులు పాల్గొన్నారు. అంతకుముందు నందిగాం టీడీపీ కార్యాలయం ఆవరణలో పార్టీ పతాకాన్ని అచ్చెన్న, రామ్మోహన్ ఆవిష్కరించారు.



అచ్చెన్న సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచ్ ఇందిరమ్మ, రమేష్‌నాయుడు దంపతులు

జగన్‌ను ఓడిస్తేనే.. గ్రామ వ్యవస్థల మనుగడ

- పీఆర్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్
- ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా సర్పంచ్‌ల నిరసన

అరసవల్లి, ఫిబ్రవరి 29: 'జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోయింది. గ్రామాల్లో కనీసస్థాయి అభివృద్ధి లేదు. అందుకే జగన్‌ను ఓడిద్దాం.. గ్రామ వ్యవస్థలను కాపాడుకుందాం' అని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. కార్యాలయం ప్రధాన గేటు వద్ద మండుటెండలో కింద కూర్చుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. 'జగన్ పాలనలో సచివాలయ వ్యవస్థను తెచ్చి.. పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కాజేశారు. గ్రామాల్లో అభివృద్ధి కాదు కదా.. కనీసం వీధి దీపాలు వేయడానికి కూడా ఇబ్బందిపడే పరిస్థితి కల్పించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. నాలుగేళ్లుగా పోరాడుతున్నా.. ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పనిచేయాలని కోరారు.

- సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని, జగన్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని తెలిపారు. జగన్‌రెడ్డి అరాచకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. జగన్ ఓటమితోనే పంచాయతీల మనుగడ సాధ్యమని స్పష్టం చేశారు.
- సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ మాట్లాడుతూ సర్పంచ్‌లను దిష్టిబొమ్మలుగా మార్చి, పంచాయతీ నిధులను కాజేసిన జగన్‌రెడ్డిని ఓడించడానికి అందరూ కంకణబద్ధులం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల బాధలు జగన్‌రెడ్డికి పట్టవని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ఓటమితోనే పంచాయతీల పునరుజ్జీవనం వస్తుందన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి బీరు ప్రతాపరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణంనాయుడు, వై.వినోద్‌రాజు, వానపల్లి ముత్యాలరావు, ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయితీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్క ధనుంజయ యాదవ్, రాష్ట్ర నాయకులు భానోజీనాయుడు, రౌతు శ్రీనివాసరావు, అప్పలనాయుడు, గోవిందరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సర్పంచ్‌లు

సర్పంచ్‌ల నిధులు పక్కదారి

- న్యాయం చేయాలని అచ్చెన్నకు వినతి

టెక్కలి, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల నిధులను పక్కదారి పట్టించింది. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు సొంత అవసరాలకు వినియోగించింది' అని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, వి.లక్ష్మీముత్యాలరావు ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే తమకు న్యాయం చేయాలని కోరుతూ.. గురువారం కోటబొమ్మాళిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల విధులు, హక్కులను కాలరాసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు కేటాయించి పనులు చేపట్టాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల గౌరవవేతనం నెలకు రూ.15వేలకు, ఎంపీపీ, జడ్పీటీసీల గౌరవ వేతనం రూ.30వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనులు చేయించాలని కోరారు. మైనింగ్ సెస్, ఇసుకలో వాటా నిధులు, రిజిస్ట్రేషన్ ఫీజులు, ప్రొఫెషనల్ ట్యాక్స్, ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్, నీటితీరువా తలసరి గ్రాంట్ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. 2019 నుంచి ఎగ్గొట్టిన రూ.4వేల కోట్లు తక్షణమే పంచాయతీలకు చెల్లించాలన్నారు. గ్రామపంచాయతీ నిధులు వినియోగంలో ఉన్న ఫీజింగ్ ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ ఉమ్మడిగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 29: చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచాలని, జిల్లాలో ఉత్పత్తి చేస్తున్న చేనేత దుస్తులను అందరూ ధరించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం 'ఒన్ డిస్ట్రిక్ట్.. ఒన్ ప్రొడెక్ట్' కింద పొందూరు కాటన్ వస్త్రాలను ఎంపిక చేసిందని తెలిపారు. నేటి ఆధునిక వస్త్రాలతో పోటీపడుతూ జిల్లా చేనేత ఉత్పత్తులు దేశం మొత్తాన్ని ఆకర్షిస్తున్నాయన్నారు. వీటి ఉత్పత్తి, అభివృద్ధి కోసం కొత్త డిజైన్‌లు, ఉత్పత్తులు, వాల్యూ యాడెడ్ ఉత్పత్తులను, అవసరాలకు తగినట్లుగా రెడీమేడ్ వస్త్రాలను అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అధికారులు, సబార్డినేట్ సిబ్బంది అందరూ ప్రతీ సోమవారం జిల్లాలో ఉత్పత్తి చేసిన చేనేత దుస్తులను ధరించాలని కోరారు. కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదలకు సహకరించాలని సూచించారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

- ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా

గుజరాతీపేట, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీ అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం శ్రీకాకుళంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ధర్నా చేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తోందన్నారు. వారికి 30శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్సీని 2023 జూలై నుంచి అమలు చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.నవీన్‌కుమార్ మాట్లాడుతూ డీఏ, పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ శ్రీనివాసరావు, జి.గోవిందరావు, త్రినాథరావు, కె.మురళీధరరావు, కె.గురుమోహన్ పట్నాయక్, బీవీకే గుప్తా, కె.శ్రీనివాసరావు, వెంకటరావు, జగన్నాథరావు, మోహనరావు పాల్గొన్నారు.

వీరి పుట్టినరోజు ప్రత్యేకం

- 'లీప్' సంవత్సరం నాడు చిన్నారుల జననం
- నాలుగేళ్లకోసారి బర్త్‌డే వేడుకలంటూ తల్లిదండ్రుల హర్షం



రిమ్స్‌లో చిన్నారులతో తల్లులు





పాతపట్నంలో..

అరసవల్లి/ శ్రీకాకుళం అర్బన్/ పలాస/ నరసన్నపేట/ పాతపట్నం, ఫిబ్రవరి 29: లీప్ సంవత్సరం వేళ.. గురువారం జిల్లాలో పలుచోట్ల చిన్నారులు జన్మించారు. సాధారణంగా ఫిబ్రవరి నెలలో 28 రోజులే. నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరంలో మాత్రం ఫిబ్రవరి నెలకు 29 రోజులు ఉంటాయి. ఈ ప్రత్యేకమైన దినాన జన్మించిన వారికి నాలుగేళ్లకోసారి పుట్టినరోజు వస్తుంది. ఇలా.. గురువారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)లో ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి సమీపాన రాణిపేటకు చెందిన పిల్లా ప్రమీలకు రెండో కాన్పులో భాగంగా మగ శిశువు జన్మించాడు. అలాగే బుడుమూరుకు చెందిన భీంపల్లి గౌరి రెండో కాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చింది.

- పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో మందస మండలం సందిగాం గ్రామానికి చెందిన సవర సరోజినికి కుమారుడు జన్మించాడు.
- నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు చిన్నారులు జన్మించారు. పోలాకి మండలం మతలబుపేటకు చెందిన బొంగు లైల మొదటి కాన్పులో కుమార్తెకు జన్మనిచ్చింది. సారవకోట మేదరవీధికి చెందిన తులుగాపు హేమలతకు రెండో కాన్పులో కుమారుడు పుట్టాడు. మబుగాం గ్రామానికి చెందిన పి.వసంతకు తొలి కాన్పులో కుమార్తె జన్మించింది.
- అలాగే పాతపట్నం సీహెచ్‌సీలో ఏఎస్ కవిటికి చెందిన లక్ష్మీకి కుమార్తె పుట్టింది. దీంతో తమ చిన్నారుల పుట్టిన రోజు ఎంతో ప్రత్యేకమని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రుల సిబ్బంది, వైద్యులు సైతం వారిని అభినందించారు.



నరసన్నపేటలో..



పలాసలో..



వైభవంగా వాసుదేవుడికి అభిషేకం

మందస, ఫిబ్రవరి 29: మందస వాసుదేవపెరుమాళ్ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా చేపట్టిన బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు కూర్మనాథస్వామి ఆధ్వర్యంలో విష్వక్సేన ఆరాధన, ధ్వజారోహణ, స్వామికి అభిషేక సేవలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. లోహరిబందకు చెందిన శ్రీమన్నారాయణ భక్తిస్వర సంఘం వారిచే సంగీత విభావరి, ఆండాళ్‌గోష్టి బృంద సభ్యులు ఆంజనేయ స్వామి భక్తి గీతాలను ఆలపించారు. పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

నేటి కార్యక్రమాలివే..

మూడోరోజు శుక్రవారం యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ, హోమాలు, ధ్వజారోహణ, హనుమ, శేషవాహనాల సేవలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీలోకి భారీ చేరికలు

- మేఘవరం పంచాయతీ వైసీపీ నేతలకు పార్టీలోకి ఆహ్వానం
- కండువా వేసి స్వాగతించిన అచ్చెన్నాయుడు



టెక్కలి: వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో అచ్చెన్నాయుడు

టెక్కలి: టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో పట్టున్న వైసీపీ నాయకులు, 70 కుటుంబాల వారు ఆ పార్టీకి రాజీ నామా చేసి గురువారం టీడీపీలో చేరారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానం పలికారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో మేఘవరం మాజీ సర్పంచ్ అల్లు మాధవరావు, ఐదో వార్డు సభ్యుడు అల్లు వెంక ట్రావు, మాజీ ఉప సర్పంచ్ గుంట తవిటయ్య మాజీ వార్డు సభ్యుడు జి.గోపి నాథ్, వైసీపీ కార్యకర్తలు జన్ని చంద్రరావు, గూన రాఘవ రావు, జి.సూర్య నారాయణ, శ్రీరామ్, చింతాడ శ్రీనివాస రావు, లంబ భీమా రావు, జన్ని భీమారావు, మాజీ వలంటీర్ బమ్మిడి ఫల్గుణరావు తదితర 70 కుటుంబాల వారున్నారు. ఈ సందర్భంగా అల్లు మాధవరావు తదితరులు మాట్లాడుతూ.. అభివృద్ధి అచ్చెన్నాయుడు వల్లే సాధ్యమని భావించి తామంతా వైసీపీని వీడి టీడీపీలో చేరామన్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, రానున్న ఎన్నికల్లో ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపి, టీడీపీ-జనసేన కూటమి విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, కెల్లి శ్రీరాములు, వందనం తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటుతో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేపట్టాలి

నరసన్నపేట: సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో విద్యారంగం నాశనమైందని, అందువల్ల యువత ఓటుతో పునర్నిర్మాణం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రజా సదన్‌లో టీఎన్ఎస్ఎఫ్ నేతలతో కలిసి గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఏటా రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి జగన్ అధికారంలోకి వచ్చారని, అయితే 52 నెలలైనా నేటికీ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమ ర్శించారు. యువతను అంధకారంలోకి నెట్టేశార న్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను యువత గమనించి ఓటు అనే వజ్రాయుధంతో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపి టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. తాడేపల్లిగూడెంలో బుధవారం టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందన్నారు. సీఎం జగన్ రెడ్డి రాష్ట్రాన్ని ధ్వంసం చేశారని, రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు టీడీపీ-జనసేనతో చేతులు కలపాలన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలగ ప్రహర్ష, ప్రధాన కార్యదర్శి గుర్రాల సుశాంత్ కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు మెండ గౌరినాయుడు, పల్లి సీతామపల్లి, తంగి తారకేశ్వర రావు, బొచ్చ జయరాం, యాళ్ల వరుణ్, ముద్దాడ రామకృష్ణ, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

టీడీపీతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పలువురు నేతలు అన్నారు. గురువారం వివిధ గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అవగాహన కలిగించారు.

సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమం



బొంతు గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహిస్తున్న నేతలు

జలుమూరు (సారవకోట): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో సంక్షేమం సాధ్యపడుతుందని నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి సురవరపు తిరుపతిరావు అన్నారు. చిన్నకిట్టలపాడు పంచాయతీ బొంతు గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సురవరపు అప్పలనాయుడు, తాడేల భీమారావు, చల్ల ఆనందరావు, డి.జయరాం తదితరులు పాల్గొన్నారు. అలాగే గుమ్మపాడు పంచాయతీ అగదల గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెం టీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో, వైసీపీ వైఫల్యాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తర్ర లచ్చుము, బలగ రవికుమార్, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే భవిష్యత్‌కు గ్యారెంటీ

జి.సిగడాం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్‌కు గ్యారెంటీ అని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి టంకాల మౌళీశ్వరరావు తెలిపారు. గురువారం డీఆర్‌వలస, టీడీ వలస, బాతువ, మదుపాం, దవళపేట, పెంట, నాగులవలస, మెట్ట వలస తదితర గ్రామాల్లో బాబూ ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు కూనుబిల్లి కూర్మారావు, బెవర జగన్నాథరావు, మహదాశ్యం చిన్నారావు, పైల రామకృష్ణం నాయుడు, కంచరాన సూరన్నా యుడు, చిత్తిరి అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి అండగా ఉండాలి

కవిటి: రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీకి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల కోరారు. గురువారం నెలవంక పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే టీడీపీ-జనసేన పార్టీలకు మద్దతు ఇవ్వాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి అశోక్‌ను గెలిపిం చాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మణిచంద్ర ప్రకాష్, ఎస్‌వీ రమణ, చిన్నబాబు, రంగారావు, విజయ కృష్ణ, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.



కవిటి: బాబు ష్యూరిటీ పత్రాలు అందజేస్తున్న నాయకులు



జి.సిగడాం: సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పలాసరూరల్: బ్రాహ్మణతర్లా సబ్ స్టేషన్ 33/111 కేవీ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం, గరుడఖండి, అనంతగిరి, బంటుకొత్తూరు, కేదారిపురం, పెదంచల, చినంచల, రాజగోపాలపురం, ఈదురాపల్లి, వీరభద్రాపురం, అమలకుడియా, పూర్ణభద్ర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జగనన్న ఇళ్ల స్థలాల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహీల్దార్

వజ్రపుకొత్తూరు: డోకులపాడు జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలను తహసీల్దార్ ఎం.సురేష్ పరిశీలించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'జగనన్న ఇళ్ల స్థలాలు.. రాళ్లపాలు' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. సర్వేయర్ తిరుపతిరావు, డీటీ గిరిరాజు, ఆర్ఐ పవిత్రతో కలిసి సదరు ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. లబ్ధిదారుల ఎంపిక జరిగినా ఇళ్ల నిర్మాణాలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. తక్షణం లబ్ధిదారులతో మాట్లాడాలని సిబ్బందికి సూచించారు.

శివరాత్రి ఉత్సవాలకు పందిరిరాట



పూజ చేస్తున్న ఈవో ప్రభాకరరావు

జలుమూరు: శ్రీముఖలింగంలోని ముఖ లింగేశ్వర ఆలయంలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు గురువారం పందిరిరాటతో శ్రీకా రం చుట్టారు. ఈవో ప్రభాకరరావుతో అర్చ కులు ప్రత్యేక పూజలు చేసి పందిరి రాటను వేశారు. ముందుగా గణపతిపూజ,పుణ్యాహవచనం, కలశ, మండపారాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, వెంకట శేషాచలం, శ్రీకృష్ణ, సింహాచలం, సర్పంచ్ టి.సతీష్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, దేవదాయ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీల రూ.2.18 లక్షల ఆదాయం

శ్రీముఖలింగేశ్వరుని హుండీల ద్వారా రూ..2,18,155 ఆదాయం వచ్చినటు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. గురువారం హుండీలను తెరిచి లెక్కించారు. ఈ మొత్తం రెండు నెలలకు సంబంధించి భక్తుల ద్వారా వచ్చిందన్నారు. దేవదాయశాఖ ఏసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జీవీటీఎస్ రవికుమార్ నేతృత్వంలో అర్చకులు, సత్యసాయి భక్తులు లెక్కించారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలి



దీక్షలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

నరసన్నపేట: నిలుపుదల చేసిన భవన నిర్మాణ కార్మిక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరిం చాలని లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.ఆదినారాయణ మూర్తి హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో భవన నిర్మాణ కార్మికులు దుర్భరమైన జీవనం సాగిస్తున్నారన్నారు. కార్మిక సంక్షేమ నిధులు కార్మికులకే వినియోగిం చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తర్ర లక్ష్మణరావు, శిమ్మ ఉమా, పైల రాము, వాన అప్పారావు పాల్గొన్నారు.

ముగిసిన గోకార్టింగ్, హేక్‌తాన్ ఆవిష్కార్

టెక్కలి: ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి గోకార్టింగ్ చాంపియన్ షిప్, హేక్‌తాన్ ఆవిష్కార్ 2కె24 కార్యక్రమాలు గురువారంతో మగిశాయి. దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన బృందాలు హేక్‌తాన్, గోకార్టింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. హేక్‌తాన్‌లో భాగంగా 'ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అండ్ డిమోలషన్' అనే అంశంపై అనిట్స్ కళాశాల రూ.లక్ష మొదటి బహుమతిని పొందింది. రూర్కెలాకు చెందిన కోయర్ యూనివర్సిటీ విద్యార్థులు 'వ్యర్థాలను తిరిగి వినియోగించడం'పై చూపిన పరిష్కా రానికి రూ.75 వేలు ద్వితీయ, విశాఖ గీతం యూనివర్సిటీ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిన ప్రదర్శనకు రూ.50 వేలు తృతీయ బహుమతిని సాధించారు.

గోకార్టింగ్ చాంపియన్ షిప్‌లో..

జాతీయస్థాయి గోకార్టింగ్ చాంపియన్‌షిప్ 2కె24కే దక్షిణాది రాష్ట్రాల నుంచి 14 ఇంజనీరింగ్ కళాశాలల బృందాలు పాల్గొన్నాయి. ఓవరాల్ విన్నర్స్ రన్నర్స్ చాంపియన్‌షిప్‌ను విశాఖ రఘు ఇంజనీరింగ్ కాలేజీ కైవసం చేసుకోగా, ఐతమ్‌తో పాటు మిగిలిన బృందాలు మిగిలిన ఉత్తమ బహు మతులను సాధించాయి. విజేతలు రూ.4 లక్షల విలువైన బహుమతులను అందించారు. కార్యక్రమంలో టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాలప్రసాద్ పెద్ది బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకుల్లో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు ఇటు వంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో గీక్స్ ఫర్ గీక్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ శిఖర్ గోయల్, కళాశాల కార్యదర్శి ఎల్ఎల్‌నాయుడు, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, కన్వీనర్ డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.



హేక్‌తాన్‌లో లక్ష రూపాయల చెక్కుతో అనిట్స్ విద్యార్థులు

విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి

కాశీబుగ్గ: కాలేజీ ఫీజుతో సంబంధం లేకుండా ఇంటర్ విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతున్నా కళాశాలల యాజమాన్యాలు ఆ అవకాశం ఇవ్వడం లేదన్నారు. తక్షణం ఇంటర్ బోర్డు అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి



శిరీషతో మాట్లాడుతున్న బ్రాహ్మణతర్లా పొందర కుల సంఘ నేతలు

పలాస: బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన పొందర కులస్థులకు కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆ కులస్థులు గురువారం పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి విన్నవించారు. గతంలో మంజూరైనా సంబంధిత కాంట్రాక్టర్ సకాలంలో స్పందించని కారణంగా నిధులు వెనక్కు వెళ్లిపోయాయని, టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే దీనిని పూర్తి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పొందర భగవాన్, కృష్ణ, పుణ్యుడు, భాస్కరరావు, కొండలరావు, మున్నా, తాతారావు తదితరులున్నారు.

కనువిందు చేసిన మయూరం



పురి విప్పి నాట్యమాడుతున్న నెమలి

హిరమండలం: హిరమండలంలోని సుభలయ మెట్ట తోట సమీపంలో గురువారం మయూరం పురివిప్పి చూపరులకు కనువిందు చేసింది. సుభలయ ఆర్ఆర్ కాలనీకి చెందిన పొగిరి సింహా చలం నాటు కోళ్లతో పాటు నెమలిని పెంచుతున్నారు. గురువారం ఉదయం ఈ నెమలి పురి విప్పి ఆడుతూ కనువిందు చేసింది. ఆటువైపు వెళ్లేవారంతా ఈ దృశ్యాన్ని చూసి ఆనందం పొందారు.

ఆధ్యాత్మికతతో ఐక్యత

జలుమూరు: ఆధ్యాత్మికతతో గ్రామాల్లో ఐక్యత సిద్ధిస్తుందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కొమనాపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండరామ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు, నాయకులు బగ్గు గోవిందరావు, బైరి భాస్కరరావు, ఉమారావు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి

వజ్రపుకొత్తూరు: పద్దెనిమిది ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సురేష్ కోరారు. స్వీప్‌లో భాగంగా గురువారం విద్యార్థులు, అధికారులు అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ గిరిరాజు, ఆర్ఐ పవిత్ర, సర్వేయర్ తిరుపతిరావు, వీఆర్‌వోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఘనంగా సోమేశ్వర స్వామి ఆలయ ప్రారంభం

పాతపట్నం: కొరసవాడలో ఉమామహేశ్వర స్వామి ఆలయ ప్రారంభం, లింగ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి సదానంద సరస్వతి గురుస్వామి పర్యవేక్షణలో వేదపండితుల ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు

నందిగాం: సుబ్బమ్మపేట లక్ష్మీనరసింహసామి అలయ ప్రాంగణంలో గురువారం సామూహిక ఉపనయనాలు నిర్వహించారు. చెమళ్ల రాంబాబు, మాధవి, సనపల రత్నంబాబు, మాలతి దంప తుల ఆధ్వర్యంలో పురోహితులు రేజేటి బోసుబాబు, సహాయకులు ఎం.రమేష్ శర్మ, ఆర్.సూర్య ప్రకాశరావు తదితరుల వేదమంత్రాలు మధ్య 109 మంది వటువులకు బ్రహ్మోపదేశం చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది.

సెంచూరియన్ వర్సిటీకి స్కూల్ ఆఫ్ ఫిషరీస్‌కై ఐకార్ ఆమోదం



వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ డీఎన్‌రావు

ఒడిశా

పర్లాకిమిడి: సెంచూరియన్ యూనివర్సిటీకి స్కూల్‌ఆఫ్ ఫిషరీస్ (బీఎఫ్ఎస్‌సీ) డిగ్రీ ప్రోగ్రామ్‌కు ఐకార్ ఆమోదం లభించిందని వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డీఎన్‌రావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ ద్వారా నాణ్యమైన విద్యను అందించడం, మత్స్య శాస్త్రరంగంలో ఆవిష్కరణలను పెంపొందించడంలో నిరంతర నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనమన్నారు. ఫిషరీస్ విద్య పరిశోధనల్లో నైపుణ్యానికి ఫిషరీస్ స్కూల్ గుర్తింపుతో పాఠశాల మత్స్య విజ్ఞాన రంగంలో ప్రముఖ సంస్థగా యూనివర్సిటీ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుందన్నారు. స్కూల్ ఆఫ్ ఫిషరీస్‌లోని బీఎఫ్ఎస్‌సీ డిగ్రీ ప్రోగ్రామ్ విద్యార్థులకు ఫిషరీస్ మేనేజ్ మెంట్, ఆక్వా కల్చర్ డైనమిక్ ఫీల్డ్‌లో రాణించేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆక్వా కల్చర్, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫిష్ ప్రోసెసింగ్ టెక్నాలజీ, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఫిష్ ఇంజనీరింగ్, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్‌మేనేజ్‌మెంట్ ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్, ఎకనామిక్స్, మరియు స్టాటస్టిక్స్‌తో సహా అనేక రకాల విషయాలపై అవగా హన కలిగిస్తున్నామన్నారు. మా నిరంతర నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనంగా నిలుస్తుందని, తదుపరి తరం మత్స్యకారులకు శిక్షణ ఇవ్వనున్నామని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏకలవ్య స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు

పాతపట్నం: స్థానిక ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయంలో 2024-25 సంవత్సరానికి గాను 6వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్‌తో ఆంగ్లమాధ్యమంలో ఆరవ తరగతిలో బాలురు, బాలికలు 30 సీట్ల చొప్పున, 7వ తరగతిలో మిగిలి ఉన్న రెండు సీట్ల భర్తీకి అర్హులైన వారు గురుకులం వెబ్‌సైట్ ద్వారా మార్చి 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఏప్రిల్ 13న రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

పీఎంజేజేవైతో భరోసా

హరిపురం: ప్రధానమంత్రి జీవనజ్యోతి (పీఎంజేజేవై) పథకంతో ఆపదలో కుటుంబానికి భరోసా లభిస్తుందని వెలుగు ఏపీఎం జి.ప్రసాదరావు అన్నారు. బిన్నల పంచాయతీ వీవీఆర్ పురంలో ఈ పథకంలో సభ్యురాలైన డ్వాక్రా మహిళ ఇప్పిల మోహిని ఇటీవల మృతిచెందారు. దీంతో ఆమె భర్త వెంకటరావుకు బీమా కింద రూ.2 లక్షల చెక్కును హరిపురం ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ విజయ తేజతో కలిసి గురువారం అందజేశారు.

రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

హిరమండలం: మండలంలో కొత్తగా రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుధాకర్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. మహేంద్రతనయ నది అవతల ఉన్న జిల్లోడిపేట, కొండపై ఉన్న అంతకాపల్లిలో ఒక్కో పోలింగ్ కేంద్రా న్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ.. తీర్మానం చేసి ఉన్నతాధి కారులకు పంపిస్తామన్నారు. కొత్తగా వచ్చిన ఓటరు జాబితాల్లో మృతుల ఓట్లు తొలగించాలని బుచ్చిబాబు కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలాకి: పోలాకి, దీర్ఘాశి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలోని వసతులను ఎన్నికల అధికారులు గురువారం పరిశీలించారు. వసతి కల్పనపై పలు సూచనలు చేశారు. మరుగుదొడ్డి, తాగునీటి సదుపాయం కల్పించాలని, ఇతరులు లోనికి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల అధికారుల వెంట ఎస్ఐ సత్యనారాయణ, వీఆర్వో బోర జగన్నా థం, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా పోరాటం

● తెలుగుదేశం పార్టీ నాయకులు

వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పోరాడుతున్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. గురువారం శ్రీకాకుళంలో టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు.

జగన్‌కు ఎందుకు ఓటువేయాలి: కూన రవికుమార్

అరసవల్లి: టీడీపీ-జనసేన నిర్వహించిన తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లిప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలిపారు. గురువారం శ్రీకాకుళంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసం చేశాడని, రాబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని,ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి రాష్ట్ర పునర్నిర్మాణంకోసం పోరాటంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. రూ. 5కే అన్నక్యాంటీన్లను ఏర్పాటుచేస్తే పేదల కడుపుకొట్టిన ద్రోహి జగన్ రెడ్డి అని విమర్శించారు.'ఇప్పుడు వచ్చే ఎన్నికల కోసం జగన్‌రెడ్డి వైనాట్175 అంటున్నాడు.మేం అడుగుతున్నాం. మనం ఎందుకు జగన్‌కు ఓటేయాలి. జగన్‌రెడ్డి నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఎక్కడ, డీఎస్సీ ఎక్కడ, ఉచితంగా ఇసుక ఎక్కడ...ఉద్యోగులకు 1వ తేదీకి జీతాలు ఎక్కడ,సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ' అని నిలదీ శారు. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలో బ్లూప్రింట్ టీడీపీ దగ్గర ఉందని, ఇప్పటికే ప్రజా ప్రయోజనాల కోసం సూపర్ సిక్స్ ప్రకటిం చామని తెలిపారు.


మాట్లాడుతున్న రవికుమార్

ధర్మానా..అభివృద్ధిపై చర్చకు సిద్ధమా ?: గుండ

చంద్రబాబునాయుడు 14 ఏళ్ల సీఎంగా పనిచేసినా అభివృద్ధి చేయలేదని మంత్రి ధర్మాన విమర్శించడం హాస్యాస్పదమని, అభివృద్ధిపై చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం...మీరు సిద్ధమా అని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ,మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రశ్నించారు. గురువారం అరసవల్లిలో వారు విలేకరులతో మాట్లా డుతూ మంత్రిగా మీరు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం దృష్టిలో పెట్టుకుని అమరావతికోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందని తెలిపారు. అమరావతిలో రాజధాని నిర్మాణంకోసం చంద్రబాబు చేసిన కృషి అద్భుతమని, ఆయనపై నమ్మకంతో రాజధాని ప్రాంత ప్రజలు, రైతులు 33వేల ఎకరాల భూమిని ఇచ్చారని గుర్తుచేశారు.వైసీపీప్రభుత్వం కోరితే ఎంతమంది ప్రజలు, రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములు ఇవ్వగలరో మీకే తెలియాలన్నారు. ఉన్న వాటినే కబ్జాచేసి, అవినీతిలో కూరుకుపోయిన వైసీపీ నాయకులు ప్రజల వద్ద పూర్తిగానమ్మకాన్ని కోల్పోయారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అది రుజువవుతుందని చెప్పారు. పనులు చేయడానికి కాంట్రాక్టర్లు కూడా ముందుకురాని దీనమైన పరిస్థితి రాష్ట్రంలో ఉందని, వైసీపీ ప్రభుత్వంపై గల విశ్వసనీయత ఏపాటిదో గుర్తెరిగి మాట్లాడాలని హితవు పలికారు.


మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధం

సరుబుజ్జిలి:రానున్నఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనిటీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని,ఈ విషయాన్ని బుధవారం తాడేపల్లిగూ డెంలో ఏర్పాటుచేసిన జెండా బహిరగ సభ రుజువు చేసిందని చెప్పా రు. గురువారం సరుబుజ్జిలి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వ హించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అనంతరం ఆయన యరగాంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంతరం అప్పులతో ప్రజలకు రూ.10 ఇచ్చి 90 రూపాయలు వైకాపా ప్రభుత్వం లూటీచేస్తోందని తెలిపారు.టీడీపీ- జనసేన పార్టీలను రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

లావేరు: తాళ్లవలస వద్ద గల 16వ నెంబరు జాతీయరహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ సీహెచ్ స్వామినాయుడు కథనం మేరకు.. మండలంలోని తాళ్లవలసకు చెందిన అదపాక సూర్యారావు(52) గ్రామంలో నుంచి జాతీయరహదారిపై నడుచుకుని దాటుతున్నాడు. అదేసమయంలో రణస్థలం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న లారీఢీకొనడంతో సూర్యారావు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సూర్యారావుకు భార్య అచ్చాలమ్మతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరిద్దరి ఇదివరకే వివాహాలుజరిగాయి. సూర్యారావు మృతితో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. భార్య అచ్చాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నరసన్నపేట:పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బొరిగివలసకి చెందిన యడ్లరమణ (30) మృతి చెందినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మూడు రోజులు కిందట బొరిగివలస గ్రామంలో దేవుని సంబరాల్లో జరిగిన గలాటాలో రమణను అదే గ్రామానికి చెందిన బందాపు సూర్యనారాయణ గాయపరిచారు. క్షతగాత్రుడు నరసన్నపేటలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి తల్లి సింహాద్రి, తండ్రి నీలయ్య భార్య చిన్న కుమార్తె ఉన్నారు. కుటంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో వారు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం నగరంలో ఓ బాలిక అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదుఅందింది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. రూరల్ మండలంలోని సానివాడ(శ్రీపురం) గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి కుమార్తె, కుమరుడు ఉన్నారు.కుమార్తె శ్రీకాకుళంలో 80అడుగులరోడ్డు సమీపంలో గల ఓ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. గతనెల 28న కళాశాలలోని ఓ ఉపాధ్యాయిని ఫోన్ నుంచి తండ్రికి రూ.300ల ఫీజు చెల్లించాలని ఫోన్‌చేసింది. దీంతో తండ్రి కళాశాలకు వెళ్లి డబ్బులిచ్చి హాల్‌టిక్కెట్ తీసుకుని కుమార్తెను కలిసి ఇంటికి వెళ్లమని చెప్పాడు. అయితే కుమార్తె ఇంటికి చేరకపోవడంతో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఒకటో పట్టణ పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ బలివాడ గణేష్ కేసు నమోదు చేశారు.

బెల్ట్‌షాపులకు మద్యం తరలిస్తే చర్యలు

● ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ సుబ్బారావు

శ్రీకాకుళంక్రైం: ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బెల్ట్‌షాపులకు మద్యం తరలించినా, అందుకు సహకరించిన సేల్స్‌మెన్లు, సేల్స్ సూపర్‌వైజర్లపై కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్, డిపో మేనేజర్ బి.సుబ్బారావు గురువారం ఒకప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ నిర్వహించే మద్యం దుకాణాలకు ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ కొన్ని నిబంధనలు సూచించారని తెలిపారు. ప్రతిమద్యం దుకాణంలో ఆర్-1,ఆర్-2, ఆర్-3 బుక్కులను అందుబాటుఉంచాలని,అందులో ప్రతిరోజూ స్టాక్ వివరాలను సూపర్‌వైజర్లు నమోదుచేయాలని కోరారు.కొత్తబ్రాండ్ల ఎమ్మార్పీ వివరాలు కనపడేలా రేట్ల షీట్ ఏర్పాటుచేయాలని తెలిపారు. పాడైన బీర్లు, బ్రీజర్లు, మద్యం బాటిళ్ల ఆర్వోఎంవో లేదా ఏఆర్ఓ ఎమ్ఓలతో పంచనామా రాయించి పారబోయాలని సూచించారు.ప్రతిషాపులో సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలని, వాటిని అప్‌డేట్‌చేసి లింక్ అయ్యేలా చూడాలని కోరారు. బిల్లు బుక్కులు ఉంచి అడిగిన వారికి బిల్లులివ్వాలని ఆదేశించారు.షాపులో ఫ్రిజ్‌లు పనిచేసేలా చూసుకోవాలని తెలిపారు. ప్రతి ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలతోపాటు నిబంధనలు పాటించని వారిపై చర్యలు కూడా తీసుకుంటామని పేర్కొన్నారు.

వివాదాల జోలికి పోతే బైండోవర్ కేసులు: సీఐ

పొందూరు: ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎవరైనా వివాదాలజోలికి పోతే బైండోవర్ కేసులు ఎదుర్కోవలసి వస్తుందని ఆముదాలవలస సీఐ దివాకర్ హెచ్చరించారు. ఎన్నికల దృష్ట్యా మండలంలోని గోకర్ణపల్లి, గోరింట, తాడివలస తదితర గ్రామాల్లో పోలింగ్‌కేంద్రాల పరిశరాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా విడిచిపెట్టేది లేదని, కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఎన్నికల సమ యంలో వివాస్పదవ్యక్తులపై దృష్టి సారించాలని ఎస్‌ఐ వై .రవికుమార్‌ను ఆదేశించారు.


గోకర్ణపల్లిలో పోలింగ్ బూత్ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ, పోలీసు అధికారులు

ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని: పీడీ

గార: జాబ్‌కార్డుఉన్న ప్రతిఒక్కరికీ వంద రోజులు పని కల్పించను న్నట్లు డ్వామా పీడీ చిట్టిరాజు తెలిపారు. గురువారం నిజామాబాద్‌లో కారి చెరువు, తండ్యాలపేటలోఉపాధిపథకం పనులను పరిశీలించి వేతనదారులతో మాట్లాడారు. ఉపాధి పనులు నాణ్యతగా నిర్దేశించిన వేళల్లో చేయాలని తెలిపారు. సాగు నీటి వనరులు, చెరువులు,కాలువల్లో పనులు చేపట్టడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెంచుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో సంధ్యారాణి, జేఈ నారన్నాయుడు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టండి

● శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం క్రైం: నగరంలో దోమల సమస్యపై స్పందనలో ఫిర్యాదులొస్తున్నాయని ప్రతి డివిజన్‌లో దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని శ్రీకాకళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా పారిశుధ్య సెక్రటరీలు, కార్మికులకు ఆదేశించారు. గురువారంస్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రిలతో పారిశుధ్య సమస్యలపై సమీక్షించారు. ప్రతి డివిజన్‌లో కాలువ పూడికతీత పనులు చేపట్టాలని, మురుగు నీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతివీధిలో ఫాగింగ్ చేయాలని తెలిపారు. పాడైన ఫాగింగ్ యంత్రాలను బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలనికోరారు.

కింతలిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

పొందూరు:మండలంలోనికింతలిలో సీతారాముల కల్యాణం జాతర పురస్కరించుకుని గురువారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఏటా జాతర పురస్కరించుకుని జిల్లాస్థాయి కబడ్డీ,మండలస్థాయి వాలీబాల్‌పోటీలు నిర్వహిస్తారు. ఈ సందర్భం గా సర్పంచ్ పైడి రామప్రసాద్, గ్రామపెద్దలు సింగూర్ రాగూర్, సన్యాసి,రావు చిట్టి నాగభూషణం, ఎంపీటీసీ హనుమంతురావు మాట్లాడుతూ గ్రామీణక్రీడ కబడ్డీని ప్రోత్సహించడం కోసమే ప్రతిఏటా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి మ్యాచ్‌లో కె.ఆర్ టీంతో కింతలి జూనియర్ జట్టు తలపడింది.

16వ తేదీకి లోక్‌అదాలత్ వాయిదా

పొందూరు:సుప్రీంకోర్టు ఆదేశాలమేరకుఈనెల తొమ్మిదో తేదీన నిర్వహించాల్సిన జాతీయలోక్ అదాలత్‌ను 16వ తేదీకి వాయిదా వేసినట్లు పొందూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి. జ్యోత్స్న తెలిపారు. పొందూరులోని కోర్టు ఆవరణలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ వరుస సెలవులుకావడంతో లోక్‌అదాలత్‌ను వాయిదావేయడంతో కక్షదారులు గుర్తించాలని కోరారు.

కనుగులవలసలో ఆర్బీకే ప్రారంభం

ఆమదాలవలస: మండలంలోని కనుగులవలసలో రైతు భరోసా కేంద్రాన్ని, పాఠశాల భవనాలను తమ్మినేని సీతారాం గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీసీ జయప్రకాష్, అగ్రికల్చర్ ఏడీ బగ్గు రజని, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పొన్నాడ అనసూయమ్మ, నిరంజన్‌బాబు, కృష్ణారావు, అనీల్, శ్రీనివాసరావు, నీలారావు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడుచుకోవాలి: ఎస్‌ఐ

శ్రీకాకుళం క్రైం: యువత సన్మార్గంలో నడుచుకోవాలని దిశ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ ఎస్.చంద్రకళ కోరారు. గురువారం శ్రీకాకుళంలోని శాంతిని కేతన్ కళాశాల విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు,గుడ్ టచ్ బ్యాడ్ టచ్, కొత్త పరిచయాలకు ఆకర్షితులు కావడం వల్ల యువతులకు కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

30 శాతం ఐఆర్ ఇవ్వాలి

● పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం
● ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు


టెక్కలి: తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు


పలాసరూరల్: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


సోంపేట: నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

12వ పీఆర్సీ గతఏడాది జూలై నుంచి అమలుచేయాలని, 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెంఛన్ విధానం పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్‌చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గురువారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత తాలూకా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. పాత డీఏ, పీఆర్సీ బకాయిలను విడుదలచేయాలని డిమాండ్‌చేశారు. కాగా ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద టెంట్ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు అనుమతిఇవ్వకపోవడంతో ఏపీటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. దీంతో చెట్టు కింద బైఠాయించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



ఇచ్ఛాపురం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఆమదాలవలస: ధర్నా నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు


పొందూరు: మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్

ఆమదాలవలసలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

ఆమదాలవలస: ఆమదాలవలసలో కలెక్టర్ మన్‌జీర్‌జిలానీ సమూన్ గురువారం సుడిగాలిపర్యటనచేశారు. తొలుత తహసీల్దార్‌కార్యాలయంలో జగనన్న భూసర్వేపై రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంతోపాటు డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. మోనంగివారివీధిలోని పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది హాజరు, రోగులకు అందజేస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జొన్నవలస సమీపంలోని 30 పడకల ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, ఎన్నికల డీటీ మురళీధర్‌నాయక్, సర్వేయర్ బొడ్డేపల్లి గోపి ఉన్నారు.


జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

ఇచ్ఛాపురం: పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలని ఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన్ ఆదేశించారు. గురువారం మండలంలోని ముచ్చింద్ర, కొళిగాం, కీర్తిపురం, తేలుకుంచి, మునిసిపాలిటీ పరిధిలో గల రత్తకన్న పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మోడల్‌కోడ్ టీము, నాలుగుమండలాల ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్‌తో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ రాగానే నియమావళి అమలుపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవో భరత్‌నాయక్, డీటీలు గురుప్రసాద్, శ్రీహరి పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో ముందుకుసాగాలి: వీసీ

ఎచ్చెర్ల:విద్యార్థులు సామాజికస్పృహతో ముందుకుసాగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. వర్సిటీలో గురువారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, జిల్లా రిసోర్స్‌పర్సన్ హెచ్.నాగభూషణరావు,సూపర్‌వైజర్ ప్రసాదరావుమాట్లాడారు. ఈ సందర్భంగా పొందూరు మండలంలోని గోకర్ణపల్లికి చెందిన చక్రపాణి కళాబృందం సభ్యులు ఎయిడ్స్ వ్యాధినిర్మూలనపై ప్రదర్శించిన జానపద గేయాలు, నృత్యాలతో ఆకట్టుకున్నాయి.


మాట్లాడుతున్న రజని

యోగాతో మానసిక ప్రశాంతత

ఎచ్చెర్ల: జీవితంలో యోగా జీవన ప్రక్రియ కావాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. ఎచ్చెర్లలోని క్యాంపస్‌ల యోగా హాల్‌ను గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో మునిరామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్‌డీన్ గేదెలరవి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, యోగా విభాగాధిపతి ఈశ్వరరావు, అరుణ బాలాజీ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి: ఆర్డీవో

ఇచ్ఛాపురం: నవరత్నాల్లో భాగంగా పేదలకు అందించిన ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని ఆర్డీవో భరత్‌నాయక్ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సమీక్షించారు. ఎన్ని పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించారో అడిగి తెలుసుకున్నారు. అర్బన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 715మంది లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ పూర్తిచే యాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీలు గురుప్రసాద్, శ్రీహరి పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయంలో పూజలు

ఇచ్ఛాపురం:పట్టణంలోని నర్మదేశ్వరాలయంఎదుట నిర్మించిన అభయ, పసన్నాంజనేయ ఆలయం ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా గురువారం జరిగింది. ఈసందర్భంగా హనుమత్ ఉపాసకులు పెంట శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీపురానికి చెందిన కళాకారులు, భజగోవింద బృందంసభ్యులు కచేరీనిర్వహించారు. శ్రీవేంకటేశ్వర మ్యూజికల్ అకాడమీ వ్యవస్థాపకుడు చిన్నాగురుస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులు నాట్య ప్రదర్శన చేశారు.

నూకాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా రోడ్‌లోగల నూకాలమ్మ తల్లి అమ్మవారిఆలయ నాలుగో వార్షికోత్సవం, మాఘబహుళ పంచమి పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి మంగళవాయిద్యాలతో అభిషేకాలు చేసి దమ్మల దండకంతో పూజలు జరిపారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలన

గార: అంపోలు జడ్పీ ఉన్నతపాఠశాల, వమరవెల్లి డైట్, ఏపీ బాలికల గురుకుల పాఠశాలలను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్ఐపీ) రాష్ట్ర పరిశీలకుడు ఎన్.ఉపేంద్ర రెడ్డి గురువారం పరిశీలిం చారు. ఈసందర్భంగా ఎనిమిదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలించి, అభ్యసన మెరుగుపరిచేందుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, ఎంఈవో-2 పి.వినోదిని, హెచ్ఎంజ్యోతి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'వందేభారత్'కు హాల్ట్ ఇవ్వాలి

ఇచ్ఛాపురం: వందేభారత్ రైలును భువనేశ్వర్- విజయవాడ, లేదా భువనేశ్వర్- విశాఖ వరకు నడిపి ఇచ్ఛాపురంలో హాల్టింగ్ ఇవ్వాలని జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు కట్టా సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్ జీఎం మనోజ్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. అలాగే పూరి- అహ్మదాబాద్ రైలును కూడా ఇచ్ఛాపురంలో హాల్టింగ్ కల్పించాలని కోరినట్లు తెలిపారు.

వైసీపీ పాలనలో అన్నివర్గాలకు అన్యాయం

జి.సిగడాం: వైసీపీ పాలనలో అన్నివర్గాల వారికి అన్యాయం జరిగిందని బీజేపీ మండలాధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం విమర్శించారు. గురువారం నాగులవలస, వీఆర్‌పేట, మద్రివలస, అబోతులపేట, అద్వానంపేట తదతర గ్రామాల్లో ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, నాయకులు పొగిరి దాశరధి, జి.అప్పలరాజు, టి.గౌరినాయుడు, పి.అప్పారావు, ఎం.పోలారావు పాల్గొన్నారు.

●ఎచ్చెర్ల: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గపార్టీ కోకన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు తెలిపారు. అరిణాం అక్కి వలసలో బీజేపీ ప్రజాపోరు యాత్ర-2ను నిర్వహిం చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పుణ్యపుశంకరరావు, బాలసత్యనారాయణ పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వం నిధులతో అమలుచేస్తున్నారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బుద్దాల నిర్మలా రెడ్డి తెలిపారు. మునిసిపాలిటీలోని 23వ వార్డు బెల్లుపడకాలనీ, పాత బస్టాండ్ జంక్షన్‌లో బీజేపీ ప్రజాపోరు-2 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలోపార్టీ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల:ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ముగ్గురు వలంటీర్లపై వేటు

రణస్థలం: మరణించిన వారి పేరుతో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన గ్రామ వలంటీర్లపై వేటుపడింది.ఈ మేరకు వారినితొలగిస్తూ ఎంపీడీవో రమణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. రావాడపంచాయతీ లంకపేటలోఅంత్యోదయ కార్డులకు సంబంధించి రెండేళ్ల కిందట చనిపోయిన వారి పేర్లతో ముగ్గురు వలంటీర్లు రేషన్ పక్కదారి పట్టించారు. ఈ విషయంపై పేదల బియ్యం వదలరా? శీర్షికతో ఫిబ్రవరి 26న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో జిల్లా పౌరసరఫరాల అధికారి స్పందించి విచారణ చేపట్టాలని రణస్థలంతహసీల్దార్ రామారావుకు ఆదేశించారు.ఈనేపథ్యంలో రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు.లంక అసిరయ్య, కిల్లారి అప్పమ్మ, సిరిపురపు చిలకమ్మ, ముగుడు వరలక్ష్మి తదితర అంత్యోదయ లబ్ధిదారులు ఇది వరకే చనిపోయారు. వారి పేరిట వలంటీర్లు ఎదులబలరాం, మంగరాజు నీలవేణి, బొంతు ఆరుద్ర రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించినట్టు విచారణలో తేలింది. ఈ నివేదికను జిల్లా పౌరసరఫరాల అధికారికి చేరడంతో వలంటీర్లను తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు వారిని వలంటీర్ విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఎంపీడీవో రమణమూర్తి ప్రత్యేక ఉత్తర్వులు జారీచేశారు.

3న శ్రీకాకుళంలో వైద్యశిబిరం

అరసవల్లి:శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్దగల మెడిసిన్‌బ్యాంకు ప్రాంగణంలో ఈనెల మూడో తేదీన జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ జగన్మోహనరావు ఆధ్వర్యంలో మెగావైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈసందర్భంగా చిన్నపిల్లల, చర్మవ్యాధులు, మధుమేహ వ్యాధి నిపుణులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధించిన కరపత్రాన్ని రెడ్‌క్రాస్ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు చైతన్యకుమార్, అనంతపల్లి నర్సింగరావు, బి.సతీష్, గుణాకరరావు,పెదకోట కళ్యాణ్ పాల్గొన్నారు.

టెట్‌కు 364 మంది హాజరు

ఎచ్చెర్ల:మండలంలోని రెండు కేంద్రాల్లో ఉపాధ్యాయ అర్హతపరీక్ష (ఏపీటెట్) గురువారం కూడా జరిగింది. శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండుషిఫ్ట్‌ల్లో 200కు 181 మంది, శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్‌కళాశాల (ఎచ్చెర్ల)లో 200కు 183 మంది హాజరయ్యారు. రెండు కేంద్రాల్లో కలిపి రెండు షిఫ్టుల్లో 400కు 364 మంది హాజరుకాగా, 36 మంది గైర్హాజరయ్యారు. ఈనెల ఏడో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

పొందూరులో ఫీవర్ సర్వే

పొందూరు: పొందూరులో తాడివలస పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గురువారం ఫీవర్ సర్వే నిర్వహించారు. పొందూరులోని పార్వతీనగర్ కాలనీలో రెండురోజుల కిందట ముగ్గురికి డెంగ్యూ సోకినట్లు ప్రాథమిక పరీక్షల్లో నిర్ధరణ కావడంతో పార్వతీనగర్ కాలనీ సమీపంలో ఉన్న వీధులతో పాటు పట్టణంలో ఫీవర్ సర్వే నిర్వహించారు.ఈసర్వేలో మరొకరికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు, మరికొంతమంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. డెంగ్యూ పరీక్షలు నిర్వహించామని తోలాపి వైద్యులు రమేష్ నాయుడు తెలిపారు.

ప్రధాన శాస్త్రవేత్తగా చిట్టిబాబు

ఆమదాలవలస: ఆమదాలవలస వ్యవసాయ పరిశోధనాకేంద్రం ప్రధానశాస్త్రవేత్తగా డాక్టర్ జి.చిట్టిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలో ఇన్‌చార్జి ప్రధాన శాస్త్రవేత్తగా ఇంతవరకు రాగోలులోని విత్తన పరిశోధన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీవీ సత్యనారాయణ వ్యవహరించారు. చిట్టిబాబు గతంలో ఆమదాలవలస ఏరువాక కేంద్రంలో కృషివిజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తగా, జిల్లా రైతులకు విస్తరణ సేవలందించారు. ఈమేరకుఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం చిట్టిబా బును వ్యవసాయ పరిశోధనా స్థానానికి అధిపతిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

తాగునీటి సమస్యపై వాడీవేడి చర్చ

● తక్షణమే పరిష్కరించాలని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల డిమాండ్

ఇచ్ఛాపురం: తాగునీటి సమస్యపై ఇచ్ఛాపురం మునిసిపల్ కౌన్సిల్‌లో వాడివేడి చర్చజరిగింది. తక్షణమే ఈసమస్య పరిష్కరించాలని టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు అధికారులను కోరారు. గురువారం మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఎజెండాలో పొందుపరిచిన 16అంశాలపై చర్చ జరిగింది. ఇందులో 14 అంశాలు స్వల్ప మార్పులు మధ్య కౌన్సిల్ ఆమోదం తెలియజేసింది. మిగిలిన బహిరంగ వేలంపాటలు, కబేళా గుత్తకు సంబంధించి టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు, వైస్ ఛైర్‌పర్సన్-1 ఉలాల భారతిదివ్య అభ్యంతరం తెలిపారు. మరో వైస్ ఛైర్‌పర్సన్ లాభాలస్వర్ణమణి అభ్యంతరం తెలుపుతూ పాటలు మళ్లి నిర్వహించాలని డీసెంట్ అందజేశారు.మార్కెట్, వీధిగుత్తలు గత ఏడాది కన్నా రూ.ఆరు లక్షలు తక్కువ పాడినా వేలంపాటలు ఖరారు చేసి కౌన్సిల్‌కు ఎందుకు తెచ్చారని వైస్ ఛైర్‌పర్సన్లు స్వర్ణమణి, భారతిదివ్యలు అధికారులకు నిలదీశారు. మళ్లీ వేలంపాటలు నిర్వహించాలని కోరారు.దీంతో మళ్లీ వేలంపాటలు నిర్వహిస్తామని ఛైర్‌పర్సన్ రాజలక్ష్మి తెలిపారు.1,2,3 వార్డుల్లో అద్దె ట్యాంకర్ల ద్వారా తాగునీరందించేందుకు సాధారణనిధులు రూ.ఐదులక్షలు కేటాయింపునకు కౌన్సిల్ ఆమోదించింది. 20రోజులుగా ఎనిమిదో వార్డులో కుళాయిల ద్వారా తాగునీరు రావడం లేదని, ట్యాంకర్ల ద్వారా తాగునీరివ్వాలని, వేసవి మూడునెలలు వార్డు ప్రజలకు నీటి పన్నునుంచి మినహాయింపుఇవ్వాలని కౌన్సిలర్ మధుమూర్తి కోరారు. ప్రతి ఫంక్షన్‌కు వాటర్ ట్యాంకులతో నీరు కావాలని కౌన్సిలర్లు కోరుతున్నారని, ఇటువంటివి కోరకపోతే పూర్తిస్థాయిలో ప్రజలకు నీరందిస్తామని కమిషనర్ తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన వైస్ ఛైర్‌పర్సన్లతో పాటు 11వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ఆశి లీలారాణి అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఛైర్‌పర్సన్ స్పందించి నీటిసమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.చెరువులు,బావులు, వీధిబోర్లు బాగుజేయిస్తే తాగు నీటి సమస్య పరిష్కరించుకోవచ్చని, డ్రెయిన్లలో పూడికలు తీయాలని 11వ వార్డుకౌన్సిలర్ అధికారులకు కోరారు. కార్యక్రమంలో మేనేజర్ డి.హరిమోహన్ పాల్గొన్నారు.